రాజకీయమా? వర్ధిల్లక్కు

పిశుపాటి ఉమామహేశ్వరశా

చూడగానే అదో చిన్న సైజు పల్లెటూరన్జెప్పడానికి వీలుగా ఆ వూళ్ళో నాలుగై దొండల గడప ఉంది. అంతే గాకుండా జనాభాలెక్కల టైమ్‌లో ఉపయోపడేందుగ్గానూ గడపలేని గుడిసెలుగూడా కొన్ని ఉన్నాయి.

ఊరి చుట్టూతా పొలాలున్నాయి. ఆ పొలాలకి స్వంత యజమానులూ ఉన్నారు. అద్దెయజమానులూ ఉన్నారు. ఆ పొలాల్లో నిక్షిప్తమైయున్న బంగారాన్ని తవ్వి వెలికితీసి యజమానుల కప్పగించడానికి కర్షకులున్నారు. శ్రామికులున్నారు. (ఈ శ్రామికుల రక్తాన్ని పైసల్లోకి మార్చుకుని పట్నాలకి పోయి పారిశ్రామికులైన వాళ్ళు గూడా ఉన్నారనుకోండి. అది వేరే విషయం)

వీరందరికీ తగిన సదుపాయాలు సమకూర్చడానికి ఓ కోఆపరేటివ్ (జనబడే) స్టోర్సుంది. తనఖా బ్యాంకుంది. రిక్రియేషన్ పేర డబ్బులు గుంజుకోడానికో డేరా సినిమా హాలుంది. దానికి అనుబంధం(లా)గా ఓ కాకా హోటలు, కిళ్ళీబడ్డీగూడా ఉన్నాయి. ఒక్కకిళ్ళీ కావలసిన వారే కాదు, బుడ్డికోసం గూడా చాలామంది జనం ఆ బడ్డీకే వెళ్తారు.

కాగా, పిల్లల్నీ, పెద్దల్నీ తీరిక సమయాల్లో విజ్ఞాన ఖనుల్ని చేయడానికో పొడుంకాయి పంతులుగారున్నారు. చేసిన పాపాలు కడుక్కోడానికి వీలుగా ఊరి మధ్యనో చెరువూ. దానికి అసింటా ఆస్తి ఉండీగుడా నాస్తికుల చేతుల్లో ఉన్న దేముడూ, అతగాడి తాలూకు ఆలయమనబడే ఒక శిధిల కట్టడమూ ఉన్నాయి.

సంజెవేళ భోజనాలయేక తీరిగ్గా ఊసులాడుకుంటుంటూ, కష్టసుఖాలు చెప్పుకుంటుంటూ గుడికెదురుగానే ఏ చంద్రగుప్త మౌర్యుడి కాలం నాటిదో అన్న భ్రమకలిగించే ఓ రావి చెట్టూ, దానికి చుట్టూతా కట్టిన సిమెంటు చప్టా ఉన్నాయి.

'మీరొక్కరే గాదు. తోటి(దేశ, విదేశ) ప్రజలుగుడా ఇలాగే అఘోరిస్తున్నారు'ని చాటిచెప్పటానికి ఓ రేడియో ఉంది. శ్మశానంలో చెట్టుకి వ్రేలాడే భేతాళుడి శవంలా దాని తాలుకు మైకు ఈ రావి చెట్టు కొమ్మల్లోనే ఓ దానికి వేలాడుతూంటుంది.

చుట్టు పక్కలంటున్నీ కుగ్రామాలు కావడం మూలాన ప్రజల్ని కన్న బిడ్డల్లా ఆదరించి, వారి కష్టసుఖాల్ని విచారించి సమస్యల్ని సరిదిద్దడం కోసం ఉద్దేశింపబడ్డ పంచాయతీ సమితి కార్యాలయంగుడా ఈ గ్రామం లోనే ఉంది.

ఒక్కసారి చూసీచూడగానే ముంజేతి కంకణంలా స్పష్టంగా ఇన్ని విషయాలు అగుపడుతున్నా 'రాజకీయం' అన్న ముక్క వినిపించక పోవడం గానీ దానితాలూకు చిహ్నాలు కనిపించక పోవడంగానీ ఆశ్చర్యం గలిగించే విషయమే.

అంతమాత్రాన ఆ ఊళ్ళో రాజకీయాలు లేవనడం అనుకోడం అంత సబబు కాదు గాలీ వెల్తురూ మొదలైన పంచ భూతాలతో పాటు కలసిపోయిన రాజకీయాలు ఆరో భూతంలా మారి ఆ ఊరి వాతావరణాన్ని ఆక్రమించుకుని ప్రజలజీవితంలో ఓముఖ్య

మైనభాగమై కూచున్నాయి.

చిత్రమేమిటంటే గాలి ఉన్నది. కంటికికనబడదు. స్పర్శవల్ల తెలుస్తుంది. రాజకీయాలూ అంతే. పైకి చూడ్డానికి కన బడవ్. వాటివల్ల లాభమో నష్టమో పొందిన వాడికీ, అటువంటి వాళ్ళు తెలిసిన వారికీతప్ప ఆ ఊళ్ళో నీ రాజకీయాల ఉనికి ఇతరులకు తెలీదు.

వేలమంది జనం ఒకచోట గుమిగూడి ఉన్నా మౌనంగా ప్రార్థన జేస్తున్నప్పుడు అలుముకునే భయంకరమైన నిశ్శబ్దం చాటున ఉన్నవాడికి అక్కడెవరూ లేరనే భావన కలిగించినట్లు సూర్యగోళంలోని వాతావరణాన్ని మించి ఉండే రాజకీయాల్ని వెన్నెలకన్నా చల్లగా మార్చి ఈ ఊరిజనాలకి అసలిటువంటి ఊసే తెలీదు గాబోలు అన్నస్థితికి తీసుగొచ్చిన ఘనత పెదనాయుడిగారిది.

ఆ ఊరికి మొట్టమొదటి సారిగా రాజకీయాలొచ్చినపుడు సరాసరి వారింటకే వచ్చి బసచేసి ఆతిథ్యం పుచ్చుకున్నాయి. నాయుడుగారు వాటి నెంతో ఆదరించి, ఆ ఊళ్ళో ఒక ఉనికి కల్పించి, పెంచి పెద్ద చేసిన కారణంగా కొంతకాలమయ్యేసరికితమయిల్లు చాలకపోతే పంచాయతీ ఆఫీసను పేర వేరే యిల్లుకట్టించి వాటి నందులో ప్రవేశపెట్టి ఇన్నాళ్ళుగా ఇన్నేళ్ళుగా తామే గార్డియన్‌గా ఉంటూ వచ్చేరు. అవిగూడ ఆయన ఇలాకాలో పెంపుడు కుక్కలా విశ్వాసంతో ఆయన్నే అంటిపెట్టుకునుంది ఎందరెన్ని విస్కత్తులు చూపించినా చలించలేదు

కానీ హఠాత్తుగా పెదనాయుడుగారు కనుమూయడంతో అసలు కథ ఆరంభమైంది.

తెలుగు భాషలో 'రాజకీయం' అన్న ముక్కొకటుందని తెలిసున్న ప్రతివాడికీ పెదనాయుడుగారు కీర్తిశేషులైనారన్న వార్త వినగానే పుట్టెడు దుఃఖం కలగడానికి బదులు ప్రజల భవిష్యత్తు ఏమిటి? వీళ్ళ ఆలనా పాలనా ఎవరు చూస్తారు. వీళ్ళను కడుపులో పెట్టుకుని కాపాడగల వ్యక్తి ఎవరు ఎవరన్న ప్రశ్నలు పెనుభూతాలై ఎదురుగా నిల్చి ఝడిపింపగా భయపడిపోయేరు.

నాయుడుగారి మరణంతో వాళ్ళకి జగత్తంతా అంధకారమలుముకొన్నట్టూ, భూభ్రమణం ఆగిపోయినట్టూ, దేశం మొత్తంమీద బ్లాక్ మార్కెట్ వ్యాపారం ఆగిపోయినట్టూ అనిపించి వణికిపోయేరు.

ఈ వణిక్ప్రముఖులందరూ 'పంచాయితీ ఆఫీసులో ప్రెశిడెంటుగారి కుర్చీలో కూచోగల సమర్థులెవరా' అని అనతి కాలంలోనే బట్టతల వచ్చేటంత తీవ్రంగా ఆలోచించేరుగానీ ఆ 'ఎవగో' గారు మాత్రం వారి బుఱ్ఱలకు తట్టలేదు.

కొంతమంది మనసులు మాత్రం కొన్ని పేర్లను సూచించేయి, కొన్ని పేర్లను అనుమానించేయి. (ఈపేర్లను తలచుకోగానే కొంతమంది గుండెలు గుభేలు మన్నాయి.

మరికొంతమందికి 'నేనే' నన్న సమాధానం దొరికింది. ఇంటో బిడ నెట్టుకుని ఊరంతా కల్దిరిగినట్టిదేటే అని వారాశ్చర్యపడి లేచేక అందులోని సాధ్యాసాధ్యాలను గూర్చి ఆలోచించడంలో లీనమయ్యేరు.

ఏ ఒకరిద్దరికో మాత్రం అనాధలైన అమాయిక ప్రజలను చూడ్డం వల్ల కలిగిన కడుపుకోత భరించలేక ఏడ్చినబడిఁ మీ రేం భయపడకండిక. నేనున్నానిక్కడ. మిమ్మల్ని నా కంటి పాపల్లో దాచుకుంటానంతే' అని అరవాలన్నంత వూపొచ్చేసింది.

మనసుల్లో ఎవరెవరేమాలోచించుకున్నా పైకి మాత్రం ఆ పదిరోజులూ ఊరిచెరువు పొంగి పొర్లిపోయేట్టు కడవలకొద్దీ కన్నీరు గార్చడంలోనే నిమగ్నులైపోయేరు పెద్ద అందరూను.

పెద్దకర్మ గూడా ఐపోయేక నాలుగు రోజులకి, వచ్చేవారంలో ఉండబోయే రాజకీయ పరిస్థితుల్లా మండిపడిపోతున్న ఎండలో పనవి ఎక్కడికో పారిపోబోతూంటే పట్టుకోబోయిన మంత్రిలా స్పీడుగా అవధాని గారింటి చీడీ లెక్కేడు వీరాసామి.

అవధానిగారి గురించి ఒక్క ముక్కలో చెప్పాలంటే 'బ్రహ్మర్షి'. ఈ మూడక్షరాల ముక్కనీ విడదీసి చెప్పాలంటే చాలా ముక్కలవసరమౌతాయి.

ఊళ్ళో ఉన్న కొద్దిమంది సంపన్న గృహస్థుల్లోనూ అవధానిగారు ఒక మెట్టు పైన ఉన్నవారు. కానీ మనిషిని చూస్తే రెండువందల ఎకరాల మాగాణికి అధిపతి అని ఎవరూ అనుకోరు. ఎల్లప్పుడూ భోజరాజు ఆస్థానానికి వెళ్ళబోతున్న పండితుడి వేషంలో ఉన్నా వేదంలో ఎనభై రెండు పన్నాలూ చదువుకున్నవారని పసిగట్టలేనంత అమాయకంగా ఉంటారు.

ఎప్పుడైనా ఇంట్లోంచి బయటికి వచ్చినపుడే బంగారపు పొన్నుకర్రగాని మిగతా సమయాల్లో ఆయన చేతుల్లో అష్టోత్తర శతనామావళి పుస్తకాలో, భగవద్గీతో ఉంటాయని ఆయనతో ఏ పాటి పరిచయం ఉన్నవారైనా చెప్తారు.

భక్తి భావంతోగానీ వ్యంగ్యంగా గానీ నలుగురూ చాటుగా అనుకునే 'పరమ భాంధసుడు' అన్న మాటను ఆయన మొహంమీద అనేసినా, అలా అన్నవాడెవడైనా ఒక చిర్నవ్వు నవ్వేసి ఊరుకునే సహనమూ, సౌశీల్యమూ ఆయనకున్నాయి.

ఈ పైన వివరించిన గుణాలుగల వ్యక్తికి అన్నివిధాలా సరితూగగల స్త్రీయే మహాలక్ష్మమ్మగారు. అందుకే ఆవిడకు అవధానులుగారి జీవితాన్ని పంచుకునే భాగ్యం కలిగింది.

నిజంగా మహాలక్ష్మి కున్నంత సిరిసందలతో తులదూగుతున్నా ఆవిడ కళ్ళలో దిగులు గూడుగట్టుకునుండడానికి. గొంతులో బాధ జీర ధ్వనించడానికి కారణం ఉన్న నలుగురు కొడుకులూ చదువుల పేరిట విదేశాల్లో ఉన్నారన్న బెంగ.

ఉట్టుటువంటి పురాణ దంపతులు పురాణ వఠనంలో ఉన్నవేళ పీరాసామి చావడిలోకి దూసుకొచ్చి 'అవతల కొంపలంటుకుంటుంటే పురాణాలూ హరికథలూ ఏమిటండీ బాబూ! లెండి త్వరపడండి. అవతల అనాధలైన ప్రజల వెన్ను తట్టండి, అభయం ఇవ్వండి' అన్నాడు ఆయాసాన్నిగూడా నిర్లక్ష్యం చేసి.

అవధానిగారు తమ చూపుల్ని 'లావొక్కింతయులేదు—' పద్యం మీదనుండి కళ్ళజోడు పై అద్దంగుండా పీరాసామి వేపు ప్రసరించేరు.

మహాలక్షమ్మగారుకూడాఒక్కక్షణం ఒత్తులు చేయడం ఆపి ప్రశ్నార్ధకంగా చూశేరు పీరాసామి వంక.

పీరాసామి పైబట్టతో ఓ సారి మొహం తుడుచుకుని దాంతోనే నేలని శుభ్రం జేస్తున్నట్టు దులిపి గచ్చు మీద కూలబడి స్తంభానికి జేర గిల బడ్డాడు.

అతని వాలకాన్ని చూసేక 'లావొక్కింతయు లేదు....' పద్యం ఆవేల్టికిక ముందుకు సాగదనీ, గజేం ద్రుడి మొర ఇహ రేపు వినాల్సిందే ననీ రూఢీ చేస్కొని వత్తీ, ఒత్తులూ వెండి భరిణలో సర్దేసుగుని వంటింటి వేపు నడిచేరు మహాలక్షమ్మగారు ఓ గ్లాసెడు మజ్జిగ తెచ్చే ఉద్దేశంతో.

అవధానులుగారు కూడా భాగవతం మూసేసి 'ఏమిటయ్యా స్వామీ ఆహడావుడి ఎక్కడో కొంపలంటుగుంటేనే గానీ మా గుమ్మం తొక్కవుగదా' అన్నారు శాంతంగా కళ్ళజోడు తీసి కణతలు నొక్కుకుంటూ.

'ఒక్కసారి ఎక్కడో అంటు కోలేదండీ బాబూ! మన ఊళ్ళే అంటు కున్నాయి. మీలాంటి వాళ్ళు చూస్తూ ఊరుకుంటే పక్క ఊళ్ళగ్గూడా వాపించిపోతాయి. అనక చేతులు కాలేక ఆకులన్న సామెత ఉండనే ఉందిగదా'

చల్లని తేట మజ్జిగతో పీరాసామి ప్రాణం కొంత కుదుట పడింది. పక్కనే ఉన్న విసన కఱ్ఱందుకొని విసురు కొంటూ 'హమ్మయ్య' అ(నుకు)న్నాడు.

'ఇప్పుడు చెప్పవయ్యా స్వామీ అసలు విషయం సామెతలుపయోగించ కుండా....'

'అయ్యా! సూటిగా చెప్పేస్తా నాల కించండి. నాయుడుగారు కాలంచేశేక పంచాయితీ అఫీసులో ఆయన కూర్చున్న కుర్చీలో ఇంతవరకూ ఎవరూ కూర్చోని విషయం మీకు తెలుసు గదా'

'అయితే'

'అవటాని కేముందండీ బాబూ! మెడమీద తలకాయున్న ప్రతి వెధవా నేనంటే నేనంటున్నాడు ఆ కుర్చీలో కూచోడానికి'

'అయితే'

'ఇంకా అయితే గియితే ఏమిటండీ బాబు. అలా ఎడ్డమైన వాడినీ సింహాసనం మీద కూచో నిస్తామా? కైవారాలు చేస్తామా?'

'ష్! నెమ్మదిగా మాట్టాడు.

ముందాయాసం తీర్చుకో'

'అయ్యా! బయటజరుగుతున్న ఘోరాలు తెలిస్తే మీరింత శాంతంగా ఉండరు. ఎంత ధర్మరాజైనా కురుక్షేత్రంలో పాల్గొనక తప్పిందా? అబద్ధమాడక తప్పిందా? మీరు నడుంగట్టాలి మళ్ళీ పాలెంప్రజలు గుండె మీదచెయ్యేసుగుని ద్రబోవాలి అదంతే'

'నేనా నడుంగట్టాల్సింది'

ఓ పొడుం పట్టుపట్టారవధాన్లుగారు.

'మరి చెడ్డవాళ్ళు చెలరేగినపుడు మంచి వాళ్ళే గదటండీ నడుం గట్టాల్సిందీ ఎదురు చెప్పకండిక. అది రూలు'

'ఎవరయ్యా చెడ్డవాళ్ళు'

అవధాన్లుగారికి వీరాసామి మాటలు వినడమంటే సరదా. 'కొంప లంటుకున్నాయండి బాబోయ్' అంటూ పరిగెట్టుకొస్తాడు. అరఘంట గడచేక గానీ అసలు విషయం చెప్పడు.

'ఎవరేవిటండీ ఓహసారలా వీధిలో అడుగెట్టి జూడండి. వెధవ పలకరింపులూ, విషపు నవ్వులూ వాళ్ళూను. ప్రతివాడూ 'ఏంది బాబాయ్, అరేయ్ బావా' అంటూ వరసలు గలిపేస్తున్నారు. ఉదాహరణకి చెప్తాను. ఆ గొడ్డుమోతు వెధవ లేడూ....'

'ఎవరూ'

'ఇంకెవడూ. కరణంగాడే'

'తప్పు స్వామీ! అలా అనకూడదు'

'ఏమిటండీ తప్పు. పిల్లా జల్లా లేనోణ్ణి అంటే తప్పొచ్చిందా? వాడికి బిడ్డా పాపా ఎందుకు కలగ లేదంటారు. ఆ బోడిముండ కరణీగాన్ని అడ్డం పెట్టుకుని వాడు చేసిన పాపాలు ఇన్నా అన్నా. చేసినపాపం పామై చుట్టుగోకుండా పోతుందా'

'ఒకళ్ళ ఊసు మనకెందుకు జెప్పు'

'అవసరమొచ్చిందిగాబట్టి. అలా అంటీ ముట్టనట్టుండ గలిగే వ్యవహారమైతే నీవరకూ రాక పోను. చేయిదాటి పోయింది గనకనే మీకు విన్నవించుకుంటూంట. వాడప్పుడే రెండు లారీల కంకర తోలించాడు. రోడ్డేయిస్తాట్ట రోడ్డు'

'ఎవరూ'

'ఎవరా! శ్రీశ్రీశ్రీగవర్రాజులుంగారు'

మయసభ ఏకపాత్రాభినయంలో దుర్యోధనుడు "హహహా పాంచాలీ" అన్నట్టుగా అన్నాడు వీరాసామి ఆ పేరు ఉచ్చరించడమే తనకసహ్యమన్నట్టు.

"వేయించని మంచిదేగా"

"ఏవిటండీ వేయించేది? కాకరకాయ వేపుడా. చెప్పకండిక. ఒళ్ళు మండిపోతూంటేనాకు, ఎలక్షన్లయ్యేంత వరకూ ఆ కుప్పలలాగే ఉంటాయి. గెలిచేదా నాలుగేదు నెల్లు పోనేక నిక్కుతూ నీల్గుతూ పరిపిస్తాడు. ఓడేదా ఎక్కణ్ణించొచ్చేయో అక్కడికే వెళ్ళిపోతాయి. ఎవడికి తెలియదనుకండీ బాబూ ఎలెక్షన్ వాగ్దానాలు.'

'నువ్వంటున్నంత చెడ్డవాడుగా కనపడ్డులే వీరాస్వామీ. పోనీ గెలవనీ.

వ్యవహారజ్ఞానం ఉన్నవాడు. నిన్న మొన్నటిదాకా వైస్‌ప్రెసిడెంట్ గిరీ జేసినవాడుగవా'.

'వాడి బొంద. జ్ఞానం విషయ మెవ డాలోచిస్తున్నాడండీ బాబూ. వదవినూ సేసరికి అందరి కళ్లూ వచ్చబాంటేనూ. నిన్నటిదాకా బొడ్డూడనివాడు నాఅల్లుడు నిల్చున్నాట్ట. పొద్దునొచ్చి నామినేషను వడేసొచ్చాను మాటా(అన్జెప్పేదాకా తెలీదు నాకు. ఛెడామడా తిట్టేసు, కనకపు సింహాసనమున.... అని ఎంతో నచ్చజెప్పి జూసేను. 'ససేమిరా' అన్నాడు. గవర్రాజుకన్నా తీసిపోయేనా అన్నాడు. తీసిపోవుగాబట్టే ఒద్దంటు న్నానన్నాను. వినలేదు. అయ్యో! ఆ తర్వాత నా కాళ్లూ చేతులూ ఆడలేదు. సరాసరి మీ దగ్గరి కొచ్చేశేనింక. అదీ విషయం.'

'నీ అల్లుడు నిల్చుంటే నీకేమయ్యా? వదవీ, పలుకుబడీ'

చెప్పకండిక పంతులుగారూ నే విన లేనంతే. నోట్లో నాలిక లేనివాడు నిల్చున్నా ఒహటే కూర్చున్నా ఒహటే గావీ నీతిలేనివాడు లేచి నిలబడ్డాడంటే శ్మశానంగూశా మస్సై పోదటండీబాబూ. మీకేం చెప్తాను. కడుపు చించుకుంటే కాళ్ళమీన పడ్తుంది. మా అంకినీడు గురించి ఏమాత్రం తెలిసినా మీరలా అన్లేరికంతే. కన్నకూతుపు గాబట్టి కడుపులో పెట్టుకుంటున్నాను గానీ— పగవాడిగ్గూడా వద్దండీ బాబూ అటు వంటల్లుడు. వదంతే.'

'ఇంతకీ నేనేం జెయ్యాలో చెప్ప లేదు'

'మీరేం చెయ్యాలంటీ బాబూ. మీరేం చెయ్యక్కర్లేదు. ప్రెసిడెంట్ గిరీకి నేన్నిలబడుతున్నానూ అనొక్క ముక్క జనాలకి చెప్పండంతే. మిగతా పన్లన్నీ వాటంతటవే జరిగిపోతాయింక'

ఏమిటి? నేనా!'

'అవునండీ బాబూ మీరే. ఆలోచిం చకండిహ. మీరు గాకపోతే ఈ కేతి గాళ్ళటండీ అర్హులు. మీరు 'ఊ' అనం డంతే. లేకపోతే ఈ పాలెం ప్రజలకి దిక్కు లేదింక'

తనకు వరసాగ్గా కొడుకులు పుట్టు కొస్తున్నా కలగని ఆశ్చర్యం అప్పుడు గలిగింది అవధాన్లుగారికి.

ఒక్క లిప్త ఆలోచన తర్వాత చిన్నగా నవ్వేరు.

'ఈ ఆలోచన నీకెలా వచ్చిందయ్యా స్వామీ'.

'నా కొక్కడికే ఏవి టుంటీ బాబూ! మన్నేదో మాణిక్యమేదో తెలుసుకోగల ప్రతివాడికీ రావలసిన ఆలోచనే ఇదీ. మరేమీ ఆలోచించకండిక'

అవధానిగారు తమ సహజమైన నిబ్బరం, శాంత ప్రవృత్తుణవల్ల ఏరా సామి ప్రతిపాదనని అంగీకరించలేదు.

అసలాయనకు రోజులో ఎక్కువ భాగం దేముడి గదిలోనే జరిగి పోతుంది. మధ్యాహ్నం. సాయంత్రం విధిగా గీతాపారాయణమో, పురాణ పఠనమో చేయవలసిందే. తన ప్రతి శ్వాసలోనూ అంతర్భాగమైపోయిన 'దైవ చింతన' ను వదలి 'రాజకీయ చింతన' చేయడానికి ఆయన అంత రాత్మ అంగీకరించలేదు.

కానీ వీరాసామి ఆయన అభిప్రాయాన్ని సుతరామూ అంగీకరించలేక పోయేడు.

ప్రజ లెంత అమాయకులో తెలియజెప్పేడు. వాళ్ళకి ఒక ప్రభువు అండదండ లెంత అవసరమో వివరించేడు. అవకాశ పదవికోసం ఉబలాట పడుతున్న వాళ్ళెంత దుర్మార్గులో చెప్పి వాళ్ళ కులగోత్రాలు బయటపెట్టాడు. మానవసేవే మాధవ సేవన్న దేవరహస్యాన్ని మరోసారి గుర్తుజేసేడు. అవధానిగారి లాంటి వాళ్ళందరూ మిన్నకుంటే ఘోరకలి ఎలా ప్రబలిపోతుందో ఉద్ఘాటించేడు. 'అధర్మాన్ని ఉపేక్షించడం అధర్మంగాదా'ని సూటిగా ప్రశ్నించేడు.

వీరాస్వామి ఇంత అవస్థ పడ్డాక అవధానిగారి దగ్గర్నుంచి 'చూద్దాంలే' అన్న ముక్క దీసుకుని బయటపడ్డాడు.

వీరాస్వామి వెళ్ళిపోయేక మన్నేదో మాణిక్యమేదో తెలుసుకో గలిగినవాళ్లు వంతుల ప్రకారం (వచ్చినట్టుగా) వచ్చి అవధానిగారి అభ్యర్థిత్వాన్ని అభ్యర్థించేరు.

రెండ్రోజులు సుదీర్ఘంగా ఆలోచించేక రాత్రిళ్లు కలలో శ్రీకృష్ణపరమాత్మతో సంప్రదించేక అనాథలైన శ్రేయోభిలాషులకి అభయ మిచ్చేరు అవధాన్లుగారు.

ఆనందం పట్టలేని ఆశ్రితులు 'కొండిభొట్లు అవధాన్లుగారికీ జై' అని మొట్టమొదటి సారిగా వీరాస్వామి నాయకత్వంలో అవధా. గారి భవనాన్ని నినాదాలతో మార్మోగించేరు.

శ్రీ మహాలక్ష్మమ్మగారి రెండు మకో ముడుసుకున్నట్లుగా ఒళ్లు జలదరించింది. ఈ నిర్ణయం మంచికా చెడుకా అన్నటువంటి అనుమానపు పొరేదో రెపరెపలాడింది ఆవిడ మనసులో.

ఎలెక్షనాఫీసుకి అవధాన్లుగారి నామినేషన్‌గూడా చేరింది. దాంతో అభ్యర్థుల సంఖ్య మూడుకి పెరిగింది.

కరణం గన్రాజు అప్పటికే పాత పరిచయాలు తిరగేయడం ఐపోయింది.

వీరాస్వామల్లుడైన అంకిసీడు కొత్త పరిచయాలు చేస్కోడంగూడా ఐపోయింది.

ఐనా అవధానిగారి పార్టీ కామి భయపడలేదు. శరవేగంతో జనాల్లోకి దూసుకుపోయేరు. కారు మేఘాల్లా కమ్ముకున్నారు ముక్కుల్లో ఒబ్బిడ వేసినట్టు తిగులుకొని ఓటర్ల ఊపిరాడనీయలేదు.

ఎక్కడ చూచినా ఆహోలు .... ఓహోలు .... రుస రుసలు .... గుస గుసలు.... హామీలు .... వాగ్దానాలు .. పరిచయాలూ.. పరాచికాలూ జోరుగా సాగిపోతున్నై.

అంతటా హడావుడి .... కోలాహలం.

ఆరేళ్ళ కుట్టాడుగూడా అసలైయ్యేళ్ళ వృద్ధుణ్ణి ఎడీధిలో నిలబెట్టి ఫలానా వారికి వోటెయ్యమని శాసిస్తున్నాడు.

ముక్కూ మొహం తెలీనివాళ్ళు మరో ముక్కూ మొహం తెలీని వాళ్ళని ఆత్మబంధువుకన్నా ఆప్యాయంగా పలకరిస్తున్నారు. క్షేమ సమాచారాలడుగుతున్నారు.

ఇన్నేళ్ళు నాయుడుగారి పాలనలో గ్రామ ప్రజలకు జరగని సౌకర్యాల నెన్నిటినో (భూతద్దంగుండా) ఎత్తి చూపి 'ఈ కన్నీళ్ళు, ఈ కష్టాలు కలకాలం కాపురం చెయ్యవ్' అని ధైర్యం జెప్పి' మిమ్మల్నుద్ధరించడానికి నడుం గట్టింది ఫలానా బాబే' అని ఒకటికి పదిసార్లు గుర్తు జేసేస్తున్నారు.

'ఆ బాబు' హయాం వచ్చేక ప్రజా జీవనం ఎలా మారబోయేదీ టెక్నికలర్ దృశ్యాలలో కళ్ళముందు నిలబెడ్తున్నారు.

మొత్తంమీద రోజులు గడుస్తున్న కొద్దీ మామిడిపళ్ళు మాగేసే గదిలో లాగా ఆ ఊరి వాతావరణంలో ఒక విధమైన ఉద్రిక్తత ఏర్పడింది.

రెక్కలొచ్చిన కొడుకులు విదేశాల కెగిరిపోయినా ఎంతో అవుసరం పడేదేగానీ గడప దాటి కాలు బయట పెట్టాల్సిన అవుసరం కలగని అవధాని గారికి ఈ సందడి సమూహాల్నీ చూస్తూంటే తన చుట్టూ ఏం జరుగుతుందో అర్థంగాలేదు. తెలుసుకోడానికి ఉత్సాహం గూడా చూపలేదాయన.

ఖాతిమంతా పరానికి సంబంధించినంత వరకూ కృష్ణపరమాత్మ మీదా ఇహానికి సంబంధించినంత వరకూ వీరాస్వామిమీదా వదేసి నిమిత్త మాత్రులై కూచుండిపోయేరు.

వీరాస్వామి బైటనించి లోనికొచ్చినప్పుడెల్లా ఒక్కో విచిత్రమైన వార్త చెప్పేవాడు.

'దొంగ వెధవలు. వాళ్ళ ఎత్తులు జూసేరండీ బాబూ! వీళ్ళ దుర్మార్గానికి నాయుడుగార్ని గూడా అడ్డం పెట్టుకుంటున్నారు కాంగ్రెసువాళ్ళు గాంధీ నడ్డుపెట్టుకున్నట్లు. శిలావిగ్రహం పెట్టిస్తార్ట ఆయనది.'

'ఎవరు స్వామీ ఆ మాట అన్నది'

'ఇంకెవరు బాబూ! మా అంకినీడు పార్టీవాళ్ళే. నా కొళ్ళు మందిదండే నమ్మండి. వాళ్ళ నక్కవినయాల్జూస్తుంటేను. శిలావిగ్రహమేం కర్మ కంచు విగ్రహమే పెట్టిస్తామని చెప్పమన్జెప్పేనంటే మనవాళ్ళతో. వాళ్ళ రోగం కుదుర్తుందిదిక. ఒక్కడూ నోరెత్త లేదికంతే.'

నిజమే! ఆయన చేసిన సేవలకి కంచు విగ్రహం పెట్టించినా ఆయన ఋణం తీర్చుకోలేము స్వామీ.'

'ఇదిగిదిగో. మీరిలా అభయహస్త మిస్తారన్దెలిశే మీ తో చెప్పకుండా బయట మాటిచ్చేశాను.

ఈ విధంగా వీరాస్వామి అవధాన్లు గారిని సంప్రదించకుండా ఎన్నో నిర్ణయాలు చేసెయ్యడం వాటికాయన సంకోచించకుండా ఆమోద ముద్ర వేసెయ్యడం మామూలై పోయింది.

ఒకనాడు వీరాస్వామి రుసరుసలాడుతూ లోనికొచ్చాడు. 'దుర్మార్గులండీ బాబూ నరరూప రాక్షసులంతే. ఇలా మలుష్యుల్ని కానేవాళ్ళను నే నెక్కడా చూళ్ళేదు ఈ పాపాల నీ భూమాత సహించలేదింక.'

'ఏమిటి స్వామీ మళ్ళీఏమొచ్చింది'

'నెమ్మదిగా అడుగుతారేమిటండీ బాబూ! అవతలి వాళ్ళు మన ఓట్లన్నీ నవిలేస్తూంటేను, ఒక్కైదు వేలిలా

పారెయ్యండి వాళ్ళు అంతేదో తేలుస్తానిక'

'ఏమిటి స్వామీ ఎందుకు మళ్ళీ డబ్బు'

'ఎందుకేమిటండీ బాబూ వాళ్ళు ఓట్లన్నీ కొనేస్తున్నారు. ఎవణ్ణి కదిపినా పదీ, పదిహేనూ అంటున్నాడు. ఏవీ తెలిసీ వాళ్ళకి నేప్పి పెట్టటం కాదటండీ మరి. చూద్దాం. మన సేనా అంత చేతులు ముడుచుగూర్చున్నదీ. ఒక్కసారి గనక మనం చేయి విదిలిస్తే వాళ్ళెక్కడుంటారింక'

"గెలవడం కోసం లంచం గుడా పెట్టాలా స్వామీ. ఇటువంటి నీచప్పనులు చేసి గెలవకపోతేనేం."

వీరాసామి జాలిగా నవ్వబోయేడు గానీ అలానవ్వితే ఏడ్చినట్టుంటుందని మామూలుగానే నవ్వేడు. నవ్వడం పూర్తయేక ఇలా అన్నాడు.

"ఎందుకేమిటండీ బాబూ! మీరింత సత్యకాలపు మనుషులు గాబట్టి మీరు సింహాసనాన్నధిష్టిస్తే మళ్ళీ ధర్మం నాలుగు పాదాలా నడుస్తుందన్న ఆశతోనే మేమిన్ని బాధలు పడుతుంటం. మీరెన్ని సంస్థలకి వేల మీద విరాళాలివ్వలేదు. ఇదీ ఒక విధమైన విరాళమే. ప్రజాసేవ కే గదా మన మేంచేసినా. ఈ అమాయక ప్రజలు ఆ దుర్మార్గుల చేతుల్లో పడకుండా కాపాడడం కోసం మీరు ఖర్చు పెడ్తే అది నీచప్పనెందుకౌతుందండీ. ఇదీ ఒకవిధమైన ధర్మ కార్యమే గదా ...."

అవధానిగారు మారు మాట్లాడకుండా వీరాసామి అడిగిన మొత్తాన్నిచ్చేరు.

వీరాసామలా అడగడం, అవధానిగారలాగే ఇవ్వడం అది మొదటిసారి గాదు. ఆఖరుసారీకాదు. కనుక ఎలక్షను ముగిసే లోపల అవధాన్లుగారు చాలాసార్లు చేయి విదపవల్సొచ్చింది.

రోజులు దగ్గిర పడ్తున్న కొద్దీ ఎన్నికల ప్రచారం తీవ్రతరమైంది. ఏనోట విన్నా అవధాన్లుగారి పేరే విన

● ప్రఖ్యాతి చెందిన వేటగాడు క్లబ్‌లో మిత్రులకు తన సాహసిక అనుభవాలను చెప్తున్నాడు. "ఒకసారి నేను గుడారంలో కూర్చొని లక్షణంగా భోజనం చేస్తున్నా; ఇంతలో పెద్దపులి వచ్చి సరిగ్గా వెనక చేరి నా మెడను వాసన చూస్తుంటే ఆ వెచ్చని ఊపిరి నాకు తగిలింది, అప్పుడు నేనేమి చేశానో తెలుసా".

అప్పటికే బాగా విసిగెత్తిపోయిన మిత్రుడు లేచిపోతూ ;

"బహూశా కాలరు పైకెత్తుకొని వుంటావు" అన్నాడు

—పద్మావతీరాజ మోహన్

బడుతోంది. ఎక్కడ చూసినా ఆయన తాలూకు ఎన్నికల గుర్తే కన బడుతోంది

ఎన్నికలు ముగిశేయి.

ఫలితం ప్రకటింప బడింది.

అప్పుడు మాత్రం అవధాన్లుగారి పేరు వినబళ్ళేదు.

ఫలితం ప్రజల చెవుని బడగానే "అంకిసీడు గారికీ జై" అన్న కేకలు గ్రామాన్నంతటినీ వెల్లువలో ముంచె త్తేయి.

ఈ వార్త వినే సమయానికి భగ వత్సన్నిధానంలో ఉన్న బ్రహ్మర్షి "దైవేచ్ఛ" అనుకుని- ఒకనిట్టూర్పు వదిలేరు.

ఆతర్వాత ఒక్కొక్కరే వచ్చి అవధాని గారికి తమ సంతాపాన్ని తెలిపి రిప్లైకార్డులా వచ్చినంత అర్జెంటు గానూ వెళ్ళిపోయేరు అంకిసీడు గారికి అభినందనను తెలుపడం కోసం.

ఆ మధ్యాహ్నమే ఒకతను అవ ధానిగారింటికి పరిగెట్టుకుంటూ వచ్చేడు.

"త్వరగారావాలి బాబూ! వీరాసామి గారు విషం మింగి ప్రాణం తీసుగో బోయేరు. సమయానికి ఆచార్లుగా రడ్డు పడ్డారు. ఆయన మిమ్మల్ని చూడాలంటున్నారు.

సాధ్యమైనంత తక్కువవ్యవధిలో వీరాసామెదురుగా నిలబడ్డారు అవధాని గారు.

యింటిముందు చాలా మంది జనం ఉన్నారు. గదిలో మంచం చుట్టూ ఉన్న ముఖ్యుల్లో గవర్రాజూ, అంకి సీడూ గుడా ఉన్నారు.

అవధానిగార్ని చూస్తూనే అన్నాడు అంకిసీడు-

'క్షమించండి పంతులుగారూ! కుఱ్ఱ తనం వేడిలో ఎందరు జెప్తున్నా విన కుండా ఈ పనిజేశాను. ఇంతవరకూ వసుంధ నెలిస్తే కాలు కదపకబోదును, ఇంత జరిగేక ఈ పదవులూ పలుకు బడులూ నాకొద్దు. ఈ ప్రెసిడెంటు గిరిమీరే దీసుకుని మా మావను బ్రతి కించి పుణ్యం గట్టుకోండి. చర్మంతో చెప్పులు కుట్టించు గిచ్చుకుంటాను.' అవధానిగారు అతన్ని వారిస్తూ తమ సహజమైన చిర్నవ్వుతో జవాబిచ్చేరు.

'సోదర పకకంకిసీడూ. నువ్వు తప్పేమీ చెయ్యలేదు. నిజంగా నాకూ పదవిమీద వ్యామోహం లేదు. బనా ముసలివాణ్ణి. నీవు కుఱ్ఱవాడివి. యువ కులు పనిజేసినట్టు వృద్ధులు చేయలేరు గదా. ప్రజాసేవ జేసే మహద్భాగ్యం నీకు దక్కింది. జాగ్రత్తగా నీ కర్త వ్యం నీవు నిర్వహించు. ఆపైన పర మాత్మ ఉండనే ఉన్నాడు. ఇక మీ మావంటావా స్వామి కొచ్చిన ఆపదేమీ దేదు. ఆచార్ల గారి హస్తవాసి మనకు తెలిందే గనకనా....'

ఈలోపల వీరాస్వామి కళ్ళు తెరిచి అవధాన్లుగారివేపు పశ్చాత్తాపంతో దహించుకుపోతున్న హృదయంతో చూసేడు. దరిమిలా అందర్నీ ఆ గది విడిచిపెట్టి పొమ్మన్నట్టుగా సైగ జేసేడు.

అవధాన్లుగారు తప్ప మిగతా వారంతా వీరాస్వామి అనుజ్ఞ ప్రకారం

బయటికి నడిచేరు మౌనంగా. అవధాన్లుగారు పీరాస్వామిని ఆప్యాయంగా పలకరించేరు.

'ఎలా ఉంది స్వామీ'

'ఆ మాట మాత్రం అడక్కండి బాబూ నా గుండె మండి పోతోంది. ఉట్టి పుణ్యానికి నాలుగ్గోడల మధ్యనా కృష్ణా రామా అనుకునే మిమ్మల్ని బైటికి లాగేను. నావల్ల మీరు చాలా నష్టపోయేరు బాబూ! ఒహటా రెండా పాతిక వేలు, నే చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం లేదంతే ఈ పాపిష్టి మొహం ఇహ మీ కక్కనబడకుండా ఉండాలని ప్రయత్నిస్తే ఆ పాపిష్టి దేవుడు ఆ అవకాశం గూడా ఇవ్వ లేదు. నా పాపానికి నిష్కృతి లేదింక లేదు'

'తప్పు స్వామీ! త్వరపడి దేవుణ్ణి నిందించకు. ఎవరెవరి ఖర్మలో ఎలా జరగాలని రాసిపెట్టుంటుందో అలాగే జరుగుతుంది. అందరమూ నిమిత్త మాత్రులమే. ఆ పాతిక వేలూ నిజంగా నావి కావేమో! అవి ఎవరికి ఎలా చేరాలో అలాగే చేరేయి. నేనేమీ బాధ పడ్డంలేదు. నువ్వేమీ బాధ పడకు. నేనా పదవి ఆశించలేదని నీకూ తెలుసు. నేను కేవలం నిన్ను సంతోషపెట్టడం కోసం, ధర్మసంస్థాపన కోసం స్వంత అల్లుడికే ఎదురు తిరిగిన నీ కోసం విల్చున్నాను. ఇందులో ఎవరిదోషమూ లేదు. ఎప్పుడేదెలా జరగాలో అలాగే జరుగుతుంది. అందుకు భిన్నంగా జరగలేదని బాధ పడడం అవివేకుల లక్షణం, అయినా గెలిచింది ఎవరో పరాయి వ్యక్తి కాదుగదా! స్వయాన అల్లుడాయె. పెద్దవాడివి. అన్నీ తెలిసిన వాడివి. నువ్వతన్ని చక్కదిద్దుకో పైనుండి. ధైర్యంగా ఉండు. వస్తా నింక'

అవధానిగారు పీరాస్వామికి ధైర్యం జెప్పి గది బయటకు నడిచేరు,

ఆయన బయటకు రాగానే అంకినీడూ గవర్రాజూ లోనికొచ్చేరు.

వాళ్ళిద్దర్నీ చూస్తూనే పీరాస్వామి చెంగున గంతేసి లేచి కూచున్నాడు మంచం మీద

ఏదో మాట్లాడబోతూ యదాలాపంగా కిటికీవేపు చూసిన అంకినీడుకీ, ఆతన్ననుసరించిన మిగతా యిద్దరికీ యింటివేపు సాగిపోతున్న అవధానిగారు కనబడేరు.

మహాప్రస్థానాని కెడుతున్నట్టున్న ఆయన్ను చూడగానే 'నీ కెందుకల్లుడూ నువ్వు నిలబడు. ఎలక్షనుకయ్యే ఖర్చు నేనెలాగో సర్దుబాటు జేస్తాను' అని అభయమిచ్చిన మామా, సకాలంలో మామగార్నుండి సరైన సహాయం పొంది అధికారాన్ని చేజిక్కించుకున్న అల్లుడూ, అందినంతలోనే పదివేలు దిగమింగి తన అభ్యర్థిత్వాన్ని అంకినీడుకి ధారబోసి మళ్ళీ ఉపప్రధువు పదవితోనే తృప్తిపడ్డ కరణం, ముగ్గురూ కలిసి జమిలిగా ఫక్కున నవ్వేరు అవధాన్లుగారికి వినబడదనే ధైర్యంతో—

□□□